నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 RANGAREDDY

## బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై దిద్దుబాటు చర్యలు

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో : గ్రేటర్ పరిధిలో జనన, మరణ ధ్రువపత్రాల జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం, కొన్ని చోట్ల తప్పుల తడకగా సర్టిఫికెట్లు జారీ అవుతున్న నేపథ్యంలో అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో అత్యంత కీలకమైన దవాఖానల నిర్వాహకులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం నెలకొందని, కరెక్షన్ ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొంటూ 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ వైద్యాధికారులు, ఉన్నతాధికారులు కలిసి ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. బర్త్, డెత్ సర్టిఫికెట్లలో ఎలాంటి తప్పులు దొర్లవద్దని, ఒకటికి రెండు సార్లు సరి చూశాకే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని దిశానిర్దేశం చేయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

## విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

### రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
### కలెక్టరేట్‌లో అధికారులతో మీటింగ్

ఆదిబట్ల, ఫిబ్రవరి 24 : ఇంటర్, టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, అదేవిధంగా రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సమస్యను అధిగమించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్, టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. టెన్త్‌లో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. అలాగే.. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాలు, మున్సిపాలిటీల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.


### ప్రజావాణికి 70 ఫిర్యాదులు..

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో రెవెన్యూ-36, ఇతర శాఖలకు 34 మొత్తం కలిపి 70 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ కోసం ప్రత్యేక కార్పొరేషన్..!

### ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ను కలుపుతూ ఫ్యూచర్ సిటీ కేంద్రంగా కొత్త కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి అధికారుల ప్రతిపాదనలు

- ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలు మున్సిపాలిటీల్లో విలీనం
- పలు మున్సిపాలిటీలను గ్రేటర్‌లో కలపాలని యోచన
- జిల్లాలో తెరపైకి రోజుకో కొత్త ప్రతిపాదన
- మంచాల, ఇబ్రహీంపట్నం మండలాలను ఫ్యూచర్ సిటీలో కలపొద్దు
- వ్యతిరేకిస్తున్న పలు గ్రామాల ప్రజలు



రంగారెడ్డి, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో తెరపైకి రోజుకో కొత్త ప్రతిపాదన వస్తున్నది. కందుకూరు మండలంలోని పంజాగూడలో ఫ్యూచర్‌సిటీ కేంద్రంగా కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సర్కార్‌కు అధికారులు ప్రతిపాదనలు పం పారు. ఇప్పటికే జిల్లాలోని పది మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో కలపాలన్న ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. కొత్తగా మహేశ్వరం, కందుకూరులను మున్సిపాలిటీలుగా చేయాలన్న ప్రతిపాదనలున్నా వాటిని పక్కన పెట్టి ఫ్యూచర్‌సిటీ కేంద్రంగా ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, యాచారం, మంచాల మండలాల్లోని పలు గ్రామాలను కలుపుతూ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి.. ఆ నివేదికను ప్రభుత్వానికి పంపించగా.. తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. ఫ్యూచర్‌సిటీ నిర్మాణంపై ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఔటర్ రింగ్ రోడ్డు లోపలి నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు(ట్రిపుల్‌ఆర్)ను కలుపుతూ అతిపెద్ద కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది.

ఫ్యూ చర్‌సిటీకి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తేనే అభివృద్ధి పరంగా ఎలాంటి అడ్డంకులు ఉండవని భావిస్తున్నట్లు సమాచారం. ఫ్యూచర్‌సిటీ కోసం ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు సర్వే చేపట్టగా అది పూర్తైంది. అలాగే, శంషాబా ద్ నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రో లైన్ ఏర్పాటు ప్రతిపాదనలూ వడివడిగా సాగుతున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్‌సిటీని ప్రత్యేక కార్పొరేషన్ చేస్తేనే బాగుంటుందన్న నిర్ణయానికి అధికారులొచ్చారు.

### ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయొద్దు

కందుకూరు మండలంలోని పంజాగూడ కేంద్రంగా ఫ్యూచర్‌సిటీ ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనపై పలు గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ గ్రామాలు పంచాయతీలుగా ఉన్నాయని, వాటిని తీసుకెళ్లి ఎక్కడో కందుకూరు మండలంలో ఏర్పాటయ్యే ఫ్యూచర్‌సిటీలో కలిపితే తమకు ఇబ్బందులు తలెత్తుతాయని ప్రజలు మండిపడుతున్నారు. ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతున్నారు.

### ఫ్యూచర్‌సిటీ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే గ్రామాలు..

జిల్లాలోని ఏడు మండలాలను కలుపుతూ ఫ్యూచర్ సిటీ ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ఇందులో కందుకూరు మండలంలోని దాసర్లపల్లి, అన్నోజిగూడ, గూడూరు, దెబ్బడగూడ, గుమ్మడవెల్లి, కందుకూరు, కొత్తూరు, గఫూర్‌నగర్, లేమూర్, మాదాపూర్, మీర్‌ఖాన్‌పేట్, అహ్మద్‌నగర్, ముచ్చర్ల, పంజాగూడ, రాచులూరు, సార్లరావులపల్లి, తిమ్మాయపల్లి, తిమ్మాపూర్.

**యాచారం మండలంలోని..** చౌదర్‌పల్లి, గున్‌గల్, కొత్తపల్లి, కుర్మిద్ద, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, మొగుళ్లవంపు, నక్కర్త, నానక్‌నగర్, నందివనపర్తి, నజ్దిక్‌సింగారం, తక్కళ్లపల్లి, తాటిపర్తి, తులేఖుర్దు, యాచారం, చింతపట్ల, నల్లవెల్లి,

**మహేశ్వరం మండలంలోని..** మహ్బత్‌నగర్, తుమ్మలూరు,

**మంచాల మండలంలోని..** నోముల, ఆగాపల్లి, మల్లిఖార్జునగూడ,

**కడ్తాల్ మండలంలోని..** చరికొండ, వట్టికల్వకుర్తి, పట్టిపడకల్, ఎక్రాజ్‌గూడ, కడ్తాల్, కర్కల్‌పహాడ్, ముద్వేన్,

**ఆమనగల్లు మండలంలోని..** రాసుంతల, కొనాపూ ర్ వచ్చేలా నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపించినట్లు జిల్లా పంచాయతీ అధికారులు తెలిపారు.

### ఇప్పటికే గ్రేటర్‌లోకి మున్సిపాలిటీల విలీన ప్రతిపాదన..

జిల్లాలోని హైదరాబాద్ శివారులోని పది మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో కలపాలన్న ప్రతిపాదన కూడా ఇప్పటికే సిద్ధమైంది. శివారుల్లోని ఔటర్‌రింగ్‌రోడ్డు లోపలి ఆదిబట్ల, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట, తుక్కుగూడ, శంషాబాద్, రాజేంద్రనగర్, మణికొండ, నార్సింగి, శంకర్‌పల్లి, బండ్లగూడ, ఇబ్రహీంపట్నంతోపాటు మీర్‌పేట, బడంగ్‌పేట నగరపాలక సంస్థలనూ గ్రేటర్ హైదరాబాద్‌లో కలపాలన్న ప్రతిపాదన కూడా ఇప్పటికే తెరపైకి వచ్చింది.




# మునగాల్సిందేనా..?

- కాలనీలు, లోతట్టు ప్రాంతాలకు వరద ముంపు తప్పదా?
- ఫిబ్రవరి నెల ముగింపునకు వచ్చినా ప్రారంభం కాని పూడికతీత పనులు
- డిసెంబర్‌లో టెండర్లు, గత నెలలో ప్రారంభం కావాల్సిన డీసిల్టింగ్
- టెండర్ల దశలోనే మీనమేషాలు లెక్కిస్తున్న ఇంజినీరింగ్ విభాగం
- జీహెచ్‌ఎంసీ పనులంటేనే దూరంగా ఉంటున్న కాంట్రాక్టర్లు
- ఈ పరిస్థితుల్లో నిర్ణీత గడువులోగా పనుల పూర్తి అనుమానమే?

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ ) : రాబోయే వర్షాకాలంలో వరద ముంపు తప్పదా..? కాలనీలు, బస్తీలు వరద నీటిలో మునగాల్సిందేనా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. ప్రతి ఏటా జనవరి నుంచే ప్రారంభం అయ్యే డీసిల్టింగ్ (పూడికతీత) పనులు ఈ ఏడాది ఫిబ్రవరి నెల ముగుస్తున్నా.. ఇంకా మొదలు కాలేదు. ఒకటి, రెండు చోట్ల తాజాగా టెండర్లు పిలిచిన అధికారులు దాదాపు వందలాది చోట్ల పనులకు టెండర్లు పిలవకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. ప్రతి ఏడాది దాదాపు రూ.60 కోట్ల మేర నాలా పూడికతీత పనులకు టెండర్లు పిలిచి వర్షాకాలం తొలకరి జల్లులు కురిసే నాటికల్లా పూడికతీత పనులను పూర్తి చేసి వరద నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలి. కానీ ఘనత వహించిన జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ నిర్వహణ విభాగం మీనమేషాలు లెక్కిస్తున్నది. అసలే ఆర్థిక కష్టాలు...అపై రూ. 1400 కోట్ల బకాయిలు చెల్లించాలంటూ కాంట్రాక్టర్ల హెచ్చరికలు...జీహెచ్‌ఎంసీ పనులంటేనే హడలిపోతున్న కాంట్రాక్టర్లతో ముందస్తు ప్లాన్‌తో వెళ్లాల్సిన ఇంజినీరింగ్ విభాగం నాలా పూడికతీత పనులను ఇప్పటివరకు ప్రారంభించలేదు. డిసెంబర్‌లో పనులకు టెండర్లు పిలిచి జనవరిలో ప్రారంభించి మే నెలాఖరు కల్లా పూర్తి చేయాల్సిన చోట ...నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దీనికి తోడు ఎస్‌ఎన్‌డీపీ మొదటి దశను ఇంకా పూర్తి చేయలేకపోవడం ..పూడికతీత పనులు చేపట్టకపోవడం పట్ల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంత ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

### కేవలం 81 శాతం పనులు

జీహెచ్‌ఎంసీ పరిధిలో వరద నీటి కాలువల పొడవు 1302 కిలోమీటర్ల మేర ఉండగా...390 కిలోమీటర్లు మేజర్ నాలా, మైనర్ డ్రైయిన్స్ 912 కిలోమీటర్లు మేర ఉన్నాయి. ప్రతి ఏటా మాదిరిగానే వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు పునరుద్ధరణ, మరమ్మతు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ఏటా రూ. 50 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. అయితే పనులను సకాలంలో జరపకుండా వరద నీటి ముంపునకు అధికారులు కారణమవుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభం నాటికల్లా పూర్తి కావాల్సిన పనులను 80శాతమే పూర్తి చేసి తొలకరి జల్లు నాటికి పూడికతీతను వర్షార్పణం చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. ఇందులో భాగంగానే 2024 సంవత్సరంలో 3.12 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను తీసి 81 శాతం పనులతో ముగించారు. రికార్డుల్లో మాత్రం ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీస్తున్నట్లు లెక్కలు చూపిస్తూ పనుల పారదర్శకతకు పాతర వేస్తుండడం గమనార్హం.

## హుడా కాంప్లెక్స్ స్థలంపై పెద్దల కన్ను..?

- ఇటీవలే వ్యాపార సముదాయాన్ని కూల్చివేసిన హెచ్‌ఎండీఏ
- కూల్చివేత మరుసటి రోజే ఆ స్థలాన్ని పరిశీలించిన ఓ వీఐపీ

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కొత్తపేట హుడా కాంప్లెక్స్...అత్యంత రద్దీ, వ్యాపారపరంగా అత్యంత డిమాండ్ ఉన్న కూడలికి ఆనుకున్న ప్రదేశం. అలాంటి చోట హెచ్‌ఎండీఏకు ఒకటీ, అరా కాదు... ఏకంగా 4,311 చదరపు అడుగుల స్థలం ఉన్నది. అక్కడున్న పాత వ్యాపార సముదాయ భవనాన్ని ఇటీవల హెచ్‌ఎండీఏ కూల్చివేసింది. దశాబ్దాలుగా దుకాణాల్లో ఉండే వారిని కోర్టు ఆదేశానుసారం ఖాళీ చేయించి కూల్చివేత చేపట్టింది. మరి... ఇంత కీలకమైన స్థలాన్ని హెచ్‌ఎండీఏ ఏవిధంగా వినియోగించుకోనున్నది?! అనే ఆసక్తి నెలకొని ఉన్న సమయంలోనే ఓ వీఐపీ ఆ స్థలాన్ని పరిశీలించడం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

### 32 దుకాణాలు..

కొత్తపేటలోని హుడా కాంప్లెక్స్ అంటే బహుశా నగరంలో తెలియనివారు ఉండరు. కొత్తపేట చౌరస్తాలో ఉండటంతో పాటు విజయవాడ జాతీయ రహదారిని అనుసరించి ఉంటుంది. వాస్తవానికి ఇక్కడ హెచ్‌ఎండీఏకు సుమారు ఎకరం వరకు స్థలం ఉన్నది. గతంలో హుడాగా ఉన్న సమయంలోనే అక్కడ రెండంతస్తుల వ్యాపార సముదాయాన్ని నిర్మించారు. 1981 నుంచి ఎగువనున్న రెండు అంతస్తులను రంగారెడ్డి జిల్లా కోర్టుకు లీజు ప్రాతిపదికన ఇచ్చారు. జిల్లా కోర్టుతోపాటు అనుబంధంగా అనేక కోర్టులు ఉండడంతో దిగువన ఉన్న దుకాణాలకు భారీఎత్తున డిమాండ్ ఉండేది. అలా 32 దుకాణాలను కూడా హుడా అద్దె ప్రాతిపదికన ఇచ్చింది. 2008లో ఇప్పుడు కొనసాగుతున్న రంగారెడ్డి కోర్టు కొత్త భవనం సిద్ధమవ్వడంతో జిల్లా, అనుబంధ కోర్టులన్నీ అక్కడికి తరలిపోయాయి. అప్పటి నుంచి పైనున్న రెండు అంతస్తులు ఖాళీగానే ఉన్నాయి.

### అప్పట్లోనే బడా నేత కన్ను..

రంగారెడ్డి జిల్లా కోర్టు కొత్త భవనానికి తరలిపోయిన తర్వాత ఆ స్థలంపై ఉమ్మడి రాష్ట్రంలో కీలకంగా వ్యవహరించిన సినీ, పారిశ్రామిక, రాజకీయ రంగ ప్రముఖుడు ఒకరి కన్ను దానిపై పడింది. లీజు ప్రాతిపదికనో... పీపీపీ విధానంలోనో... ఏదో ఒక పద్ధతిలో దానిని దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో అప్పటి హుడా అధికారులు కిరాయికి ఉన్న 32 దుకాణదారులను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించగా.. వారంతా ఒక యూనియన్‌గా ఏర్పడి కోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పటి నుంచి న్యాయస్థానంలో వివాదం కొనసాగుతూనే ఉన్నది. 2010 నుంచి కూడా సదరు దుకాణదారుల నుంచి అప్పటి హుడా, ఇప్పటి హెచ్‌ఎండీఏ కిరాయి తీసుకోలేదని తెలిసింది. కాగా ఆ వ్యాపార సముదాయ భవనం శిథిలావస్థకు చేరుకుందని, కూల్చకపోతే ప్రమాదాలు జరిగే అవకాశముందని హెచ్‌ఎండీఏ అధికారులు కోర్టు దృష్టికి తీసుకుపోయారు. దీంతో భద్రతా కారణాల దృష్ట్యా న్యాయస్థానం కూల్చివేతకు అనుమతినిచ్చింది. దాని ఆధారంగా దుకాణదారులకు నోటీసులు ఇచ్చిన హెచ్‌ఎండీఏ అధికారులు ఈ నెల 19న ఆ భవన సముదాయాన్ని కూల్చివేశారు.

### సదరు వీఐపీ పరిశీలనతో..

హుడా కాంప్లెక్స్ భవన సముదాయాన్ని కూల్చివేసిన తర్వాత సుమారు ఎకరం వరకు ఉన్న ఆ స్థలాన్ని ఒక రాజకీయ వీఐపీ ఒకరు పరిశీలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉన్న వ్యక్తి కావడంతో ఈ స్థలంపై సదరు వీఐపీ కన్నేసినట్లుగా ఖాళీ చేసిన దుకాణదారులతో పాటు స్థానికంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది.

# టార్గెట్ రూ.122 కోట్లు..!

- పెండింగ్ బిల్లుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్
- మూడు విద్యుత్ జోన్లలో రూ.122 కోట్ల బకాయిలు
- ఏఈ నుంచి చీఫ్ ఇంజినీర్ వరకు క్షేత్రస్థాయిలోనే..
- మార్చిలోపే 80 శాతం వసూళ్లకు యత్నం

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో విద్యుత్ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. మూడు సర్కిళ్లలో రూ.122 కోట్లు పెండింగ్ బిల్లులు ఉండడంతో వీటి వసూళ్లపై దక్షిణ డిస్కం దృష్టిపెట్టింది. మార్చి నెల నుంచి ఎండలు ముదిరితే విద్యుత్ వినియోగం మరింత పెరిగే పరిస్థితి ఉండడంతో అంతకుముందే పెండింగ్ బిల్లులు వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది.

వాస్తవానికి ఎప్పటికప్పుడు బిల్లులు జారీ చేసి, రెవెన్యూ కలెక్షన్ చేయాల్సిన ఇంజినీర్లు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. ఫిబ్రవరి 1 నాటికి గ్రేటర్ సర్కిళ్ల పరిధిలో 62 లక్షలకు పైగా గృహ, వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లు ఉండగా, వీటిలో రంగారెడ్డి జోన్లో 2,84,902 సర్వీసులు, మెట్రో జోన్‌లో 3,94,763 సర్వీసులు, మేడ్చల్ జోన్‌లో 2,24,816 సర్వీసులు విద్యుత్ బిల్లులు బకాయిలు పడ్డాయి. ఈ మేరకు అకౌంట్స్ విభాగం వంద శాతం రెవెన్యూ కలెక్షన్స్ లక్ష్యంగా ప్రతీనెలా డి(డిస్‌కనెక్షన్) లిస్ట్ తయారు చేసి క్షేత్రస్థాయి ఇంజినీర్లకు అందిస్తున్నది. వీరు ఎప్పటికప్పుడు ఆయా వినియోగదారుల వద్దకు వెళ్లి పెండింగ్ బిల్లులు వసూలు చేయాల్సి ఉండగా ఆ పరిస్థితి లేకపోవడంతో భారీగా బకాయిలు పేరుకుపోయాయి.

మెట్రోజోన్ నుంచి రూ.72.32 కోట్లు రావాల్సి ఉన్నది. ఆ తర్వాత రంగారెడ్డి జోన్ నుంచి రూ.38.28కోట్లు, మేడ్చల్ జోన్ నుంచి రూ.12కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. ఒక్క హైదరాబాద్ సౌత్ సర్కిల్ నుంచే రూ.51.06 కోట్లు రావాలి. సర్కిళ్లవారీగా పెండింగ్ బిల్లులు చూస్తే.. రాజేంద్రనగర్‌లో రూ.22.58 కోట్లు, హైదరాబాద్ సెంట్రల్‌లో రూ. 16.16, సైబర్‌సిటీలో రూ.7.70, వికారాబాద్‌లో రూ. 5.45, సంగారెడ్డిలో రూ. 4.28, హబ్సిగూడలో రూ. 4.04, మేడ్చల్‌లో రూ.3.73, సరూర్‌నగర్‌లో రూ. 2.55, సికింద్రాబాద్‌లో రూ.2.05 కోట్లు ఉన్నాయి. వసూళ్లకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సంస్థ ఆదేశించినా ఇంజినీర్లు పెద్దగా దృష్టిపెట్టడం లేదు. క్షేత్రస్థాయి సిబ్బంది కేవలం మీటర్ రీడింగ్‌కే పరిమితమవుతున్నారు. దీంతో పెద్ద ఎత్తున బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

### క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు..

విద్యుత్ బిల్లుల బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఎల్‌టీకి సంబంధించి మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో కలిసి రూ. 122 కోట్ల బకాయిలు ఉండగా.. వీటి వసూలుకు ఏఈ నుంచి చీఫ్ ఇంజినీర్ వరకు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ డిమాండ్ పెరిగి బిల్లులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో ఈ లోపే పెండింగ్ బిల్లుల్లో కనీసం 80 శాతం వసూలు చేయాలని లక్ష్యంగా డ్రైవ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత మూడు నెలలుగా బిల్లులు చెల్లించని వినియోగదారులపై దృష్టిపెట్టారు. వచ్చే నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో ఈలోపే బకాయిల వసూళ్లపై సీరియస్‌గా దృష్టిపెట్టినట్లు అధికారులు చెప్పారు. వచ్చేనెలలో కూడా ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని తెలుస్తున్నది. వినియోగదారులు బకాయిలు చెల్లించి సహకరించాలని వారు కోరారు. బకాయిల వసూళ్లతోపాటు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వెళ్లే ప్రతీయూనిట్‌ను బిల్లింగ్ పరిధిలోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ నెలా నమోదవుతున్న విద్యుత్ డిమాండ్, రికార్డవుతున్న యూనిట్ల లెక్కలు తీస్తూ ఎనర్జీ ఆడిట్ నిర్వహిస్తున్నారు. పెండింగ్ బిల్లుల వసూళ్లే లక్ష్యంగా ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సిబ్బంది మొత్తం పనిచేస్తున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు.



క్షేత్రస్థాయిలో పెండింగ్ బిల్లులు వసూలు చేస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ సిబ్బంది

## పార్కులను ప్రారంభించాలి

### లేదంటే గేట్ల తాళాలు పగులకొడతాం: ఎమ్మెల్యే దేవిరెడ్డి

మన్సూరాబాద్ : పదిహేడు నెలల కిందట పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పార్కులను రెండు రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, లేకుంటే గేట్ల తాళాలు పగులగొట్టి ప్రజలకు అప్పజెప్పుతామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి కేబీఆర్ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. 2023 నవంబర్‌లో ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందు నియోజకవర్గంలో 15 కొత్త పార్కులను మంజూరు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలతో ప్రారంభోత్సవం వాయిదా పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా.. పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆరు పార్కులను ప్రారంభించకుండా ఆ పార్టీ నాయకులు అధికారులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్కులు తన చేతుల మీదుగా ప్రారంభిస్తే తనకు మంచి పేరు వస్తుందని ఇన్‌చార్జి మంత్రితో ప్రారంభించాలని ప్రయత్నాలు చేశారని.. కానీ ఇంతవరకు ఇన్‌చార్జి మంత్రి అపాయింట్‌మెంట్ కూడా ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులకు దొరికినట్లు లేదన్నారు. పేరు ప్రఖ్యాతల కోసం తాను వెంపర్లాడడం లేదని రెండురోజుల్లో పార్కులను సంబంధిత అధికారులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోకపో తే గేట్ల తాళాలు పగులగొడతానన్నారు.

### కార్డియాలజిస్ట్ సూర్యప్రకాశ్‌రావుకు గ్లోబల్ అవార్డు



అంబర్‌పేట, ఫిబ్రవరి 24 : కేర్ హాస్పిటల్ సీనియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సూర్యప్రకాశ్‌రావు టాప్ మోస్ట్ హెల్త్ కేర్ లీడర్స్ గ్లోబల్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్‌రావు డీడీకాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వరల్డ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కాంగ్రెస్ అండ్ అవార్డ్స్-2025 తొమ్మిదో ఎడిషన్ వారు తనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు వివరించారు. కొన్ని దశాబ్దాలుగా దాదాపు పది వేలకు పైగా గుండెకు సంబంధించిన ఆపరేషన్లు విజయవంతంగా చేసినందుకు తనకు ఈ అవార్డును ముంబైలో అందజేసినట్లు వివరించారు.

## ట్రాన్స్‌పోర్ట్ ఫండ్

### ఉమ్టా ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్టు పన్నులు వసూలు చేసే యోచన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ) : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో ప్రత్యేకంగా అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ ఫండ్‌ను డెవలప్ చేయనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ అనుబంధ విభాగమైన అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఉమ్టా) ఆధ్వర్యంలో ఈ నిధిని సమీకరించనున్నారు. కాగా, ఉమ్టా ప్రతిపాదనల ప్రకారం నగరంలో కొత్త పన్ను విధానం ఎలా ఉంటుందనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నది. నగరంలో నిత్యం 3-4వేల వాహనాలు కొత్తగా విక్రయిస్తున్నారు. వీటికి సంబంధించిన ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఫీజు వస్తున్నది. ఈ చార్జీల్లో కొంత మొత్తాన్ని యూటీఎఫ్‌కు కేటాయించాలనే ప్రతిపాదనలు చేస్తారా? లేక హెచ్‌ఎండీఏ పరిధిలో వసూలు చేసే 1.25 శాతం వసూలు చేసే బిల్డింగ్ డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో వసూలు చేయాలని నిబంధనలు ఉన్నాయి.

దీని ప్రకారం నగరంలో కొత్తగా పన్ను వసూలు చేసి, హెచ్‌ఎండీఏ పరిధిలో రవాణా సదుపాయాలపై దృష్టిపెడతారా? అనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇదే గనుక జరిగితే నగరంలో ట్రాన్స్‌పోర్టు ప్రణాళికలను ప్రభుత్వ ప్రమేయం లేకుండానే నిధులను ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంటుంది.